నవతెలంగాణ
నవ్యత్వ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | మార్చి 04, 2024 | www.navatelangana.com

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం : మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఇచ్చోడ



ఆరు గ్యారంటీలను వంద శాతం అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీనియర్ కార్యకర్త ఇంటి వద్ద గృహలక్ష్మీ పథకంలో భాగంగా జీరో విద్యుత్ చార్జీల బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి మిఠాయిలు తినిపించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మరో పథకం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం ఈ నెల 11న ప్రారంభించనున్నట్టు తెలిపారు. అర్హులైన వారందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జలైజాకు పాల్గొన్నారు.

రేపు డీఈఓ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యల పరిష్కారంలో డీఈఓ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మంగళవారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఏ.స్వామి, వి.అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఈఓ కార్యాలయంలో ఏఎస్ఓగా నియమించబడిన ఉపాధ్యాయున్ని విధుల్లో చేర్చుకోవడంలో డీఈఓ పూర్తిగా విఫలమయ్యారన్నారు. మొదటి దశ పోరాటంలో భాగంగా ఈనెల 1న నిర్వహించిన ధర్నా శిబిరానికి విచ్చేసిన డీఈఓ, రేపే ఉపాధ్యాయున్ని విధుల్లో చేర్చుకుంటానని హామీ ఇచ్చినప్పటికీ కూడా ఇంతవరకు సంబంధిత ఉపాధ్యాయున్ని ఏఎస్ఓగా విధుల్లో చేర్చుకోలేదన్నారు. సోమవారంలోగా చేర్చుకోలేకపోతే రెండో దశ పోరాటంలో భాగంగా కార్యాలయం ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

అంగన్‌వాడీలో పెట్టాల్సింది సీసీ కెమెరాలు కాదు పౌష్టికాహారం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-దిలావర్‌పూర్

అంగన్‌వాడి కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెట్టాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనడం సబాబు కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచి ఉద్యేశంతో 40 సంవత్సరాల కింద కేంద్ర ప్రభుత్వం 5 నెలల నుంచి 5 సంవత్సరాల చంటి పిల్లలకు పౌష్టికాహారం అందించి, వారిని ఆరోగ్య భద్రత కారణంగా ప్రాథమిక దశలో ఎదగ నివ్వాలని ఐసీడీఎస్ కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కనీసం సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. అద్దె భవనాల బిల్లులు రాక టీచర్లు అప్పులు చేసి మరీ చెల్లించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికీ ప్రయాణ చార్జీలు కూడ ప్రభుత్వం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రతీ నెలలో సెక్టార్, ప్రాజెక్ట్ సమావేశాలతో పాటు ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించడం అంగన్‌వాడీ కార్యకర్తలపై అదనపు ఆర్థిక బారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వ కార్యక్రమాల ఒత్తిడిని తగ్గించి, అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నడిపించేందుకు అధికారులు, విజిటింగ్ పేరుతో చేసే ఒత్తిడి తగ్గించాలని కోరారు.

యువత నాశనానికి కారణం మద్యపానం

- తాడిహత్నూర్ గ్రామంలో మద్యపాన నిషేదం ర్యాలీ





నవతెలంగాణ-నార్నూర్

నేటి సమాజంలో యువత నాశనానికి మద్యపానం కారణమని, గ్రామ సంత్ సేవాలాల్ యూనియన్ కమిటీ సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలో రోడ్డుపై, వాడలో గ్రామ పెద్దలతో మహిళలతో కలిసి మధ్యపాన నిషేదం ర్యాలీ నిర్వహించారు. కమిటీ అధ్వర్యంలో మద్యపాన నిషేధంపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో మద్యపానం నిసేదించినప్పుడే గ్రామంలో మార్పులు వస్తాయని అన్నారు. బంగారం, డబ్బులు దోచుకునే దొంగ కన్న మద్యపానాన్ని ప్రేరేపించే, దొంగనే ప్రమాదకరమని అన్నారు. మనకు నడక సమయంలో తల్లిదండ్రులు చేయి పట్టుకొని నడిపించారు. కానీ నేటి సమాజంలో వృద్ధాప్యంలో తల్లిదండ్రుల చేయి పట్టుకోవాల్సిన మనం మందు బాటిల్ పట్టుకొని కుటుంబంలో గొడవలకు దారితీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని అన్నారు. అలాంటప్పుడు ప్రజల దన, మాన ప్రాణాలను కాపాడాలంటే మద్యపానం నిషేదం ఒకటే అన్నారు. గ్రామంలో ఇప్పటి నుంచి ఎవరైనా మందులు తెచ్చి అమ్మిన, తయారు చేసిన, ప్రోత్సహించిన వారిపై క్రిమినల్ కేసులు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, మాజీ సర్పంచ్ రాథోడ్ మధుకర్, సంతోష్ పటేల్, తానాజి నాయక్, కారోబారి జాదవ్ పృత్విరాన్, సంత్ సేవాలాల్ కమిటీ యూనియన్ సభ్యులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు చౌహాన్ కిషోర్, జాదవ్ పరశురామ్, చౌహాన్ పునిరాం, సూర్యవంశీ పండరి, రాథోడ్ గణేష్ ఏట, జాదవ్ ఆనంద్‌రావ్, గ్రామపెద్దలు సురేష్ కేంద్రే, విద్యారాణీ, సూరజ్ జాదవ్, శేషారావ్ రాథోడ్, బాబు జాదవ్ ఉన్నారు.

ఆశలు నెరవేరేనా..?

- మూతపడిన సీసీఐ, కలగా మారిన విమానశ్రయం
- సర్వేకే పరిమితమైన ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్
- గిరిజన యూనివర్సిటీ..టైక్స్‌టైల్ పార్కు ఏర్పాటుపై ఆకాంక్ష
- నేడు ఆదిలాబాద్‌కు ప్రధాని మోదీ రాక
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాకు ప్రధాని రానుండటంతో జిల్లా వాసుల్లో అనేక ఆశలు చిగురిస్తున్నాయి. పలు అభివృద్ధి పనులు ప్రారంభించి జాతికి అంకితం చేయడంతో పాటు నూతన పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసే బీజేపీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యం కావడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కొత్తగా ఏమైనా వరాలు ప్రకటిస్తారా అని జనంలో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా ఇది వరకే పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలపైనా మాట్లాడితే బాగుంటుందని ఆకాంక్షిస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాకు తలమానికంగా ఉన్న సిమెంట్ పరిశ్రమ మూతపడి ఏండ్లు గడుస్తోంది. గతంలో బీజేపీ ఎంపీని గెలిపిస్తే ఈ పరిశ్రమను తెరిపిస్తామని ఆ పార్టీకి చెందిన నాయకులు హామీనిచ్చారు. కానీ పునరుద్ధరించలేకపోయారు. గతంలో ఓ వెలుగువెలిగిన ఈ పరిశ్రమ 1998లో ఉత్పత్తి నిలిచిపోవడంతో జిల్లాలో ఒక్క పరిశ్రమ కూడా లేకుండా పోయింది. సుమారు 2వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పరిశ్రమను తెరిపిస్తే 2వేల మందికి ప్రత్యక్షంగా..మరో 3వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సమీపంలోనే రైల్వేలైన్, జాతీయ రహదారి సౌకర్యం, మరో వందేండ్లకు సరిపడా ముడి సరుకు నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. మరోపక్క ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ గుండా రైల్వేలైన్ మంజూరైంది. ప్రస్తుతం రూ.7కోట్లతో సర్వే చేపట్టారు. కానీ పనులు మాత్రం మొదలు కావడం లేదు. దీంతో ఈ రైల్వేలైన్ ఏర్పాటుచేయాలని జిల్లావాసులు అనేక ఏండ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా వీటిపై ప్రధాని మోదీ ప్రకటన చేయాలని కోరుతున్నారు.

విమానశ్రయంపై ఆశలు ..!

ఆదిలాబాద్ జిల్లాలో విమానశ్రయం ఏర్పాటుకు అన్ని అనుకూలతలు ఉన్నాయి. ఇక్కడ విమానశ్రయం కోసం తొలి నుంచే సుమారు 300 ఎకరాలకు పైగా భూమి సిద్ధంగా ఉంది. మరిన్ని ఎకరాలను కూడా సేకరించి సర్వే చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సైతం ఏర్పాటుకు ప్రయత్నాలు చేసింది. అప్పట్లో ఏవియేషన్ అధికారులు స్థల పరిశీలన కూడా చేపట్టారు. కానీ ఇప్పటి వరకు దీనిపై అడుగు ముందుకు పడటం లేదు. ఫలితంగా జిల్లావాసులకు విమానయానం కలగానే మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటితో పాటు జిల్లాలో గిరిజనులు అధికంగా నివసిస్తున్నా ఇక్కడి విద్యార్థుల కోసం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని డిమాండ్ ఉంది. దీనిపై విద్యార్థి, ఆదివాసీ సంఘాలు అనేక ఉద్యమాలు నిర్వహించారు. రాష్ట్రానికి యూనివర్సిటీ మంజూరైనా ములుగు జిల్లాకు తరలిపోయింది. దీంతో జిల్లా గిరిజనులకు నిరాశ ఎదురైంది. తాజాగా ప్రధాని గిరిజన యూనివర్సిటీ అంశం ప్రస్తావించాలని కోరుతున్నారు. మరోపక్క ఉమ్మడి జిల్లాలో అధికంగా పత్తి పంట సాగువుతుంది. ఈ పంటకు అనుబంధ పరిశ్రమగా టైక్స్‌టైల్ పార్కు ఏర్పాటుచేయాలని సర్వత్రా డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీర్ఘకాలికంగా వేధిస్తున్న ఈ సమస్యలపై ప్రధాని మోదీ ప్రస్తావిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనపై ఆదిలాబాద్ జిల్లావాసులు అనేక ఆశలు పెట్టుకున్నారు. ప్రధాని హోదాలో తొలిసారి జిల్లాకు రానుండటంతో వరాల జల్లు కురిపిస్తారని ఆకాంక్షిస్తున్నారు. ఏండ్లుగా ప్రజలు కోరుతున్న సిమెంటు పరిశ్రమ పునరుద్ధరణతో పాటు రాజధానికి సులువైన రవాణ సౌకర్యం కోసం ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. వీటితో పాటు జిల్లా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానశ్రయం ఏర్పాటు చేయాలని, రాష్ట్రానికి మంజూరైన గిరిజన యూనివర్సిటీ ములుగుకు తరలిపోయింది. ముఖ్యంగా పత్తి అధికంగా పండించే జిల్లా కావడంతో ఇక్కడ టైక్స్‌టైల్ పార్కు ఏర్పాటుచేయాలని ఏండ్లుగా డిమాండ్ వినిపిస్తోంది. కానీ కేంద్రప్రభుత్వం వీటిపై దృష్టిసారించడం లేదు. తాజాగా ప్రధాని మోదీ సోమవారం ఆదిలాబాద్‌కు వస్తున్నారు. ఇప్పటికే చేపట్టిన పనులను ప్రారంభించడంతో పాటు కొత్త వాటికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యల పరిష్కారంపై ప్రధాని స్పందించాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

పీఎంకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి : మంత్రి

- సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నట్టు మంత్రి సీతక్క వెల్లడి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రానికి దేశ ప్రధాని మోడీ వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ప్రభుత్వం తరపున తగినరీతిలో ఏర్పాట్లు చేశామని, ఒక మంచి సాంప్రదాయాన్ని పాటిస్తున్నామని ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా జిల్లాకేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన తర్వాత స్థానిక పెన్‌గంగా భవన్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు ఆరు వేల కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేయబోతున్నట్టు వెల్లడించారు. ముందుగా నేడు ఉదయం 10 గంటలకు మోడీ ఆదిలాబాద్‌కు చేరుకుంటారన్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కేంద్రమంత్రులు విచ్చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకంగా పీఎం, సీఎం, కేంద్ర మంత్రుల ల్యాండింగ్ కోసం హెలీప్యాడ్‌లను ఏర్పాటు చేయడంపై జిల్లా యంత్రాంగాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అధికారిక కార్యక్రమాలు ముగిసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి వెళ్లిపోతారని, తాను పీఎం వెళ్లేంతవరకూ ఇక్కడే ఉండి ఆయనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఘనంగా వీడ్కోలు పలుకుతానని స్పష్టం చేశారు. అంతకుముందు పీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. సభా వేదిక ప్రాంగణంతో పాటు ఎరోడ్రమ్ వద్ద హెలీప్యాడ్‌లను పరిశీలించి అధికారులను అభినందించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, మహబూబాద్ ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేథన్, ట్రైనీ ఐపీఎస్ చైతన్య పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి వేల కోట్లను ఇచ్చిన కేంద్రం

- మోడీ సభ ఏర్పాట్ల పరిశీలన
- శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కేంద్రం ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి గత 9 సంవత్సరాల కాలంలో ఎన్నో వేల కోట్ల నిధులు కేటాయించిందని బీజేపీ శాసనసభ పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మోడీ సభ ప్రాంగణం వద్ద మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంతకుముందు సభ ఏర్పాట్లను నాయకులతో కలిసి పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. మోడీని విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. మోడీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారన్న రేవంత్ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు రేవంత్‌కి అలవాటని హితవు పలికారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ టికెట్ విషయంపై మాట్లాడుతూ టికెట్ కేటాయింపు అనేది పార్టీ అంతర్గత విషయమన్నారు. టికెట్ ఎవరికి అనేది అధిష్టానం చూసుకుంటుందన్నారు.

గత ప్రభుత్వం తెలంగాణను ముంచింది...

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రాన్ని నిండాముంచాయని అన్నారు. ప్రజలు ఆ పార్టీకి బుద్ధిచెప్పి సాగనంపారని అన్నారు. దాదాపు 9 వేల కోట్లా అభివృద్ధి పనులకు ఆదిలాబాద్ వేదికగా శంకుస్థాపనలు చేయడానికి నరేంద్రమోడీ వస్తున్నారని అన్నారు. జిల్లాలోని సమస్యలైన ఎయిర్ పోర్ట్ నిర్మాణం, టెక్స్‌టైల్ పార్క్, ఆదిలాబాద్ హైదరాబాద్ రైల్వే లైన్ మంజూరు వంటివి తెలియజేస్తామన్నారు. గత ప్రభుత్వం అలసత్వం కారణంగా ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ఇంతవరకు సాగలేదని, కేంద్ర రక్షణ శాఖ నుంచి ఆనాటి మంత్రి నిర్మల సీతారామన్, ప్రపోజల్ పెట్టినా కానీ దానికి స్పందించక ఎయిర్‌పోర్ట్ పనులు ఆగిపోయాయన్నారు. లేదంటే ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ ట్రైనింగ్ సెంటర్, సివిల్ ఏవియేషన్ రెండు మొదలై ఆదిలాబాద్‌లోని ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆదిలాబాద్‌కు ప్రధాని రాక..!

- రూ.6697కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పర్యటనకు ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ టౌన్

ప్రధాని నరేంద్ర మోడీ తొలిసారి సోమవారం ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారు. ఇది వరకు చేపట్టిన పనులతో పాటు కొత్తగా చేపట్టబోయే రూ.6697కోట్ల అభివృద్ధి పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ ఖరారైంది. మరోపక్క ప్రధానితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఈ అధికారిక కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తిచేసింది. మరోపక్క పీఎం, సీఎం రాక సందర్భంగా పోలీసు యంత్రాంగం పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే ఎస్పీజీ, కేంద్ర పోలీసు బలగాలు సభా స్థలిని వారి ఆధీనంలోకి తీసుకున్నాయి. ఆ ప్రాంత పరిసరాల్లో పోలీసు బలగాలను మోహరించారు.

రూ.6697కోట్లతో అభివృద్ధి పనులు

రాష్ట్రం, జిల్లాలో కేంద్రప్రభుత్వం ఇది వరకు చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు కొత్తగా చేపట్టనున్న పనులను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. రూ.70కోట్లతో చేపట్టిన అంబాడీ నుంచి ఆదిలాబాద్ మీదుగా పింపల్‌కుట్టి వరకు విద్యుద్ధీకరించిన రైల్వేలైన్ పనులతో పాటు రామగుండంలో రూ.6వేల కోట్లతో ఎన్‌టీపీసీ నిర్మించిన రెండో థర్మల్ పవర్ యూనిట్‌ను ప్రధాని ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. మరోపక్క ఆదిలాబాద్ నుంచి బేల మధ్య రూ.491కోట్లతో చేపట్టనున్న ఎన్‌హెచ్ 353పై 32కి.మి పొడవైన రెండు వరుసల హైవే రహదారితో పాటు రూ.136కోట్లతో ఎన్‌హెచ్163పై చేపట్టే హైదరాబాద్-భూపాలపట్నం రహదారి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

రెండు గంటలు ఇక్కడే..!

ప్రధాని నరేంద్రమోదీ ఆదిలాబాద్‌లో సుమారు రెండు గంటల పాటు ఉండనున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నాగ్‌పూర్ చేసుకొని ఉదయం 9.20గంటల నుంచి అక్కడ్నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 10.20గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకుంటారు. అక్కడ్నుంచి ఉదయం 10.30గంటలకు సభా స్థలికి చేరుకొని అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 11.10గంటలకు అక్కడ ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.15గంటలకు తిరిగి మహారాష్ట్రలోని నాందేడ్‌కు పయనమవుతారు. మరోపక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాదు నుంచి ఉదయం 8గంటలకు బయలుదేరి ఉదయం 9.30గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకుంటారు. ఉదయం 11.05గంటల వరకు ప్రధానితో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం తిరిగి హైదరాబాదు వెళ్లిపోనున్నారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి పాల్గొంటున్న కార్యక్రమాలు కావడంతో పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు నిర్వహిస్తోంది. ఏడుగురు ఎస్పీలు, మరో 7గురు అదనపు ఎస్పీలు, 13మంది డీఎస్పీలు, 40మంది సీఐలు, 100మంది ఎస్ఐలతో పాటు సుమారు 2వేల మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. వీటికి తోడు కేంద్ర బలగాలు, ఎస్పీజీ, ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ విభాగాలు భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. ఇందుకు 15 జిల్లాల నుంచి పోలీసు ఫోర్స్‌ను రప్పించారు.







లక్కుగూడ రోడ్డుకు మోక్షమెప్పుడు.. ?

- టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పీప్రి నుంచి చిలాటిగూడ వరకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరైన నిర్మించడంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు ఆలసత్వం వహిస్తున్నారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు ఆరోపించారు. ఆదివారం ఆయన విడుదల చెందిన ఓ ప్రకటనలో మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలనే ఉద్యేశంతో లక్కుగూడ గ్రామ రహదారి నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.69 లక్షలు మంజూరయ్యాయని అన్నారు. ఇంతవరకు పనులు ప్రారంభించలేదని పేర్కొన్నారు. గతంలో అనేక సార్లు ఐటీడీఏ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులకు విన్నవించినా ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ కారణంగా పనులు ప్రారంభించలేదని తెలిపారు. ఎమ్మెల్యే ఎన్నికలు జరిగి మూడు నెలలు గడుస్తున్నా బీటీ రోడ్డు పనులు మాత్రం ఇంకను చేపట్టక పోవడంతో ఎంత వరకు సమంజసమన్నారు. ఐటీడీఏ అధికారులు ఇప్పటికైనా రోడ్డు పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని యెడల తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

కేంద్రం పరిధిలోని సమస్యలపై మోడీ స్పందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అభివృద్ధికి సంబంధించి కేంద్రం పరిధిలోని సమస్యలపై ప్రధాని తక్షణమే స్పందించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రం పరిధిలోని సీసీఐ పునరుద్ధరణ, ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్, విమానాశ్రయం, కాటన్ ఆధారిత పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ అంశాలపై కేంద్రం నుంచి స్పందన లేదన్నారు. గతంలో అనేక మార్లు సీసీఐ పునరుద్ధరణ విషయాన్నీ కేంద్రం దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదన్నారు. మాజీ కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి సీసీఐని సందర్శించి త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చినా ఆచరణ సాధ్యం కాలేదని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఇచ్చిన ప్రకటనను గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆదిలాబాద్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటె హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సోమవారం జరగనున్న బహిరంగ సభలో జిల్లా వాసులు ఏండ్లుగా ఎదురుచూస్తున్న డిమాండ్లపై స్పందించి, వాటికి సంబంధించిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | మార్చి 04, 2024 | www.navatelangana.com

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండల కేంద్రంలో రూ.30లక్షల అంచనా వ్యయంతో ఎంపీపీ పద్మారమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కృషితో మొత్తం రూ.30 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, చెవ్వ రాజేశ్వర్, శ్రీను, నగేష్, దశాగౌడ్, దొంతుల రాజరెడ్డి, శ్రీకాంత్, వడ్ల రాజు, అల్లూరి రాజు, గోవర్ధన్ రెడ్డి, కంకాల రవి, సబ్బాని నర్సయ్య, నరేశ్ పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న ఎంపీపీ

నవతెలంగాణ-ఉట్నూర్



కష్టాల్లో ఉన్నప్పుడు ఒకరికొకరు ఆదుకోవడమే మనిషి గొప్పతనమని ఎంపీపీ పంద్ర జైవంత్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కొలం గూడా గ్రామానికి చెందిన రైతు కొడప జంగు చేనులో వ్యవసాయ పనులు చేస్తుండగా హఠాత్తుగా అడవి పందులు వచ్చి దాడి చేయడంతో గాయాల పాలయ్యాడు. ఎంపీటీసీ కొడప అనూష సమాచారం మేరకు వెంటనే స్థలానికి చేరుకొని, జంగుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు.

పోలియో మహమ్మారిపై జాగ్రత్తగా ఉండాలి


నిర్మల్


ఆదిలాబాద్‌టౌన్


తాంసి మండలం పొన్నారిలో...


లక్ష్మణచాంద

నవతెలంగాణ-నిర్మల్

భారతదేశం పోలియో రహిత దేశంగా మారినప్పటికీ, పోలియో మహమ్మారిపై జాగ్రత్తగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సూచించారు. ఆదివారం నిర్మల్ ప్రయాణ ప్రాంగణంలో జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ వారి తల్లిదండ్రులు విధిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. మార్చి 3 నుంచి 5వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పోలియో మహమ్మారి కారణంగా ప్రపంచంలోని చాలా దేశాలు నేటికీ బాధపడుతున్నాయని తెలిపారు. 13 సంవత్సరాలుగా భారత దేశంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. చివరిగా 2011వ సంవత్సరంలో పశ్చిమ బెంగాల్‌లో పోలియో కేసు నమోదయిందన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో, పట్టణాల్లో, బస్టాండ్లలో, ప్రధాన కేంద్రాల్లో మొత్తం జిల్లా వ్యాప్తంగా మొత్తం 561 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 92,562 ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు ఉన్నారని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా.ధనరాజ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, డా. రాజేందర్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : చిన్నారులకు అంగవైకల్యం రాకుండా పోలియో చుక్కలు వేయించాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పల్స్ పోలియో ప్రారంభ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని హామాలీవాడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించారు. దీనికి డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి చైర్మెన్ అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ పోలియోపై నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం బాదపడాల్సి వస్తుందన్నారు. చిన్నారులకు పోలియో రాకుండా ప్రభుత్వం అందించే చుక్కల మందులను వేయించాలన్నారు. పోలియో బారిన పడకుండా చిన్నారులను ఆరోగ్యంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ పోలియోకు చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అప్పుడే పుట్టిన బిడ్డనుంచి ఐదేండ్లలోపు చిన్నారులు 78 వేల మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరి కోసం బృందాలను ఏర్పాటు చేసి చుక్కల మందు పంపిణీ చేస్తున్నారు. ఆదివారం తప్పిపోయిన చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది సోమ, మంగళవారాల్లో ఇంటింటికి తిరిగి చుక్కల మందు వేస్తారన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్, శ్రీకాంత్, కౌన్సిలర్ అశోక్, స్వామి పాల్గొన్నారు.

తాంసి : పోలియో రహిత రాష్ట్రంగా చూడటానికి ప్రతి తల్లి దండ్రులు తమ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించే బాధ్యత తీసుకోవాలని జెడ్పీటీసీ రాజు అన్నారు. ఆదివారం తాంసి భీంపూర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పోలియో చుక్కల కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు శ్రావ్య, డాక్టర్ నిఖిల్ రాజ్, ఆయా గ్రామపంచాయతీ కార్యాలయలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ, జెడ్పీటీసీ పాల్గొని, చిన్న పిల్లలకి పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, సూపర్‌వైజర్ తులసిరాం, సిబ్బంది ఉన్నారు.

ఉట్నూర్ : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్ఓ బాలు అన్నారు. ఆదివారం ఉట్నూరు మండలంలోని పలు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పల్స్ పోలియో కార్యక్రమానికి జెడ్పీటీసీ చారులత రాథోడ్, ఎంపీపీ పంద్ర జైవంత్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయ్ కుమార్‌లతో కలిసి పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు వేయించుకోవాలన్నారు. జీరో నుంచి 5 ఏండ్లలోపు ఉన్న పిల్లలను ప్రతి ఒక్కరూ బూత్‌కి తీసుకువచ్చి చుక్కలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూట్ అధికారి ఎం.గణేశకుమారి, మెడికల్ ఆఫీసర్ అనురాధ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు అనిత, ప్రేమల, శ్యామల, రమా ఉన్నారు.

ఇంద్రవెల్లి : నిండు జీవితానికి రెండు చుక్కలు వేయాలని జెడ్పీటీసీ అర్క పుష్పలత అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన రోడ్డుపై పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 0-5 సంవత్సరంలోపు పిల్లలు తప్పక పోలియో చుక్కలను వేయాలన్నారు. భీమ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముఖాడే విష్ణు, సోమురే నాగోరావ్ లు పిల్లలకు పోలియో చుక్కలను వేశారు.

బేల : మండలంలోని చాంద్‌పెల్లి గ్రామంలో జెడ్పీటీసీ అక్షిత పవార్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేండ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను నేషనల్ ఇమ్యూనైజేషన్ డేను పురస్కరించుకుని ఆదివారం దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేండ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, లైబ్రరీలతో సహా పర్యాటక ప్రాంతాలు, బస్టాండ్లు, ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారని, అందరు పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చాంద్‌పెల్లి మాజీ సర్పంచ్ జంగ్‌శావ్, అడానేశ్వర్ ఫౌండేషన్ చైర్మెన్ సతీష్ పవార్, శేకు, చంద్రభాన్ ఉన్నారు.

సిరికొండ : పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఐదేండ్లలోపు చిన్నారులకు రెండు పోలియో చుక్కలు తప్పక వేయించాలని ఎంపీడీఓ బాల గంగాధర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లితండ్రులు తమ బాధ్యతగా భావించి, పల్స్ పోలియో చుక్కలను వేయించాలని అన్నారు.

నార్నూర్ : చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో మందును వేయించాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు గమనించి, చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మి, హెచ్ఈఓ నాందేవ్, వైద్య సిబ్బంది దినేష్, నాయకులు కనక ప్రభాకర్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

లక్ష్మణచాంద : మండలంలో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. మండల వైద్యాధికారి ప్రత్యూష ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండలకేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ధర్మారం గ్రామంలో జెడ్పీటీసీ వాస రాజేశ్వర్, పోలియో చుక్కలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 96 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి ప్రత్యూష తెలిపారు.

పవిత్ర హజ్ యాత్ర చేసినప్పుడే అల్లా సంతుష్టుడు అవుతాడు

- యాత్రికులకు ఒకరోజు శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిర్దేశించిన నిబంధనల మేరకే పవిత్ర హజ్ యాత్ర చేసినప్పుడే ఆ యాత్ర సఫలీకృతమై అల్లా సంతుష్టుడు అవుతాడని కేంద్ర హజ్ కమిటీ శిక్షకుడు మౌలానా ముఫ్తీ ఆసిఫ్ ఉద్దీన్ నద్వి పేర్కొన్నారు. ఈ ఏడాది పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే ఉమ్మడి జిల్లాలోని యాత్రికుల కోసం స్థానిక ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. యాత్ర ప్రారంభం నుంచి తిరిగి వచ్చేవరకు పాటించాల్సిన నియమాలపై ఆయన వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హజ్ సొసైటీ సభ్యులు ఆసిఫ్ ఉద్దీన్, ఫారూఖ్, హసీబ్ పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. మహబూబ్ నగర్ జిల్లాలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అండర్ 14 క్రికెట్ టోర్నమెంట్‌లో మంచి ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన ఇషాంత్ రెడ్డి, ఓం కిరాజ్ రెడ్డిలను ఆదివారం ఆయన శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్‌లో రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పాల్గొనడం గర్వకారణం అన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో సైతం రాణించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ దయానంద్ రెడ్డి, నరోత్తంరెడ్డిలు పాల్గొన్నారు.

ఆదివాసీ విజ్ఞాన సదస్సును జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

5న మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో ఏర్పాటు చేసే ఆదివాసీ విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని ఆదివారం బోలిచేతో ఫౌండేషన్ సీఈఓ సాయికిరణ్ అన్నారు. ఈ సదస్సులో గోండి, కొలామీ, ఆదివాసీ భాష, సాంస్కృతులను అంతర్జాల మాధ్యమాల ద్వారా భద్రపరుస్తున్నామని అన్నారు. గోండి, కొలామీ భాషల్లో వికీపీడియాలు నిర్మిస్తూ కళాశాల స్థాయిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యువతలో భాష రచన సామర్థ్యాలను వెలికితీయడం కోసం ఈ సదస్సు ఎంతో దోహదపడుతుందని అన్నారు. భాషావేత్తలు, కవులు, కళాకారులు, ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై తెలంగాణ ఆదివాసీ విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఆత్రం మోతీరామ్, సిడాం కిరణ్‌లు ఉన్నారు.

కరెంట్ బిల్లు పట్ల ఎవరు అసంతృప్తికి గురి కావద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గృహజ్యోతి పథకం ద్వారా జీరో కరెంటు బిల్లు పట్ల పలు సందేహాలకు గురి అవుతున్న ప్రజానీకానికి మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అవగాహన కల్పించారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకానికి సంబంధించిన జీరో బిల్లులను పట్టణంలోని పలు వార్డులో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ లబ్ది పొందిన గృహాలకు ఆదివారం అందజేశారు. రానివారు అసంతృప్తి వ్యక్తం చేయగా, వారికి ప్రత్యేకంగా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ గృహజ్యోతి రిసిప్ట్‌తో పాటు ఆధార్ రేషన్ కార్డు జతపరిచి తిరిగి అప్లై చేసుకోవాలని అన్నారు. 200 యూనిట్లకు పైగా ఒక్క యూనిట్ ఖర్చు చేసినా బిల్లు రావడం పట్ల లబ్ధిదారులు చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. 200 యూనిట్లు రాష్ట్ర ప్రభుత్వం మినహాయించి మిగతా వాటికి కరెంట్ వర్తింపజేసేలా చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కళాశాలలో జాబ్ మేళాకు స్పందన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో టైమ్స్ ప్రో ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళకు విశేష స్పందన వచ్చింది. డిగ్రీ అర్హతతో ఆరు కంపెనీల్లో ఉద్యోగాలకు గాను ఇంటర్వ్యూలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ జలగం అనిత పాల్గొని, కంపెనీ ప్రతినిధులతో కలిసి ఇంటర్వ్యూలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొనగా వారి అర్హతలను పరిశీలించి, ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ డిగ్రీ అర్హతతో కల్పించే వివిధ బ్యాంకులు, ప్రయివేట్ సెక్టార్లలో ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుంటూ, జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఇప్పటికే తమ కళాశాలలో 4 జాబ్ మేళాలు నిర్వహించి ఎంతో మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.

అటవీ సంపదను రక్షించడం అందరి బాధ్యత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అటవీ సంపదను సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందని స్థానిక ఎఫ్ఆర్వో సంతోష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడవుల్లోని చెట్లను నరకడం, ఎండ కాలంలో ఇప్ప పువ్వు ఏరడం కోసం, నిప్పు పెట్ట కూడదన్నారు. పొగతాగి బీడీలని ఎక్కడ పడితే అక్కడ పారేసి, అటవీ సంపదను నాశనం చేయకూడదన్నారు. అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణుల హతం కోసం ఉచ్చు పెట్ట కూడన్నారు. దానితో పాటు వన్య ప్రాణులను రక్షించాలని పేర్కొన్నారు. దీనిని అతిక్రమించిన వారి పై అటవీ సంరక్షణ చట్టం కింద కేసులను నమోదు చేయడంతో పాటు ఏడు సంవత్సరాల కఠిన జైలు శిక్ష సైతం విధించడం జరుగుతుందన్నారు.

బరంపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని బరంపూర్ రైతు వేదిక భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని పురుషులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, వైద్యం చేయించుకున్నారు. దంత వైద్యులు సమియోద్దీన్ పలువురిని పరీక్షించి, దంతాలను సురక్షితంగా ఉంచుకోవాలన్నారు. పుప్పి పళ్ల గార పళ్ల కొంతమందికి ఉండటంతో వాటిని సరి చేసుకోవాలని సూచించారు. గైనకాలజీ డాక్టర్ పాల్గొని పలువురి మహిళలను పరీక్షించగా కొంత మంది మహిళలకు వివిధ రోగాలను గుర్తించినట్లు తెలిపారు. అట్టివారిని ఉచితంగా సేవ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుక, బీఆర్ఎస్ నాయకులు ముడుపు కేధారీశ్వర్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మెన్ గడుగు శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి, రమాకాంత్, వినోద్, నారాయణ, మహేష్, పోతారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న మల్టీజోన్ వన్ ఐజీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదిలాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా బందోబస్తు ప్రక్రియను పర్యవేక్షించడానికి మల్టీ జోన్ వన్ ఐజీ ఏవీ రంగనాథ్ ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆయనకు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డబ్ల్యూపీఎస్ఐ ఐ.శ్రీనివాస్, ఎస్సై అన్వర్ ఉల్ హక్ ఉన్నారు.

దివంగత సంపంగి రవికి నివాళులు

నవతెలంగాణ-నిర్మల్

పట్టణంలోని 12వ వార్డు శాంతినగర్ కౌన్సిలర్ దివంగత సంపంగి బాల రవీందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి స్వగృహం వద్ద ఆదివారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, హాజరై ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

పెండింగ్ బిల్లును వెంటనే విడుదల చేయాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సి, డీఏ, పెండింగ్ బిల్లును వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్ల కోసం టెట్ అర్హత లేకుండా ఇవ్వాలని, జీవో నెంబర్ 317 ను సవరించి స్థానికత ఆధారంగా బదిలీ ఇవ్వాలని, గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్నా సీఆర్టీలకు వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్, గోపాల్, పవన్, గజేందర్, ఇందల్ సింగ్ ఉన్నారు.

పల్స్ పోలియోను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ మేరకు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 0-5 సంవత్సరాల చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలనీ అన్నారు. ఈరోజు రాలేని వారు మరో రెండు రోజులు ఈ కార్యక్రమం ఉన్నందున ఈ పోలియో చుక్కలను వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో చుక్కలు పిల్లలకు తప్పకుండా వేయించాలి

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో బారిన పడకుండా ప్రతి చిన్న పిల్లల తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని పోలియో మహమ్మారిని దేశం నుంచి తరిమివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, బోథ్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ ఆడే వసంతరావు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | మార్చి 04, 2024 | www.navatelangana.com

1వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024-25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వుల మేరకు హైదరాబాద్‌లోని బేగంపేట్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశం కోసం నిరుపేద గిరిజన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారిని కుష్బు గుప్త ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోండు, నాయక్‌పోడ్, పర్ధాన్ (03), కొలాం, ఆంద్ (01), లంబాడా (01) ఇతర గిరిజనులకు (01) మొత్తం 6 సీట్ల ద్వారా ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలను లక్కీ డిప్ పద్ధతిన ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఈ నెల 11వ తేదీలోగా డీటీడీఓ కార్యాలయంలో సమర్పించాలని, ఈ నెల 14వ తేదీన విద్యార్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల్లో ఏర్పాట్లు

నవతెలంగాణ-కౌటాల



ఈ నెల 8 నుండి 10 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు మండలంలోని ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. మండల కేంద్రంలోని కంకలమ్మ ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో వార్ధా నది, కుర్త వద్ద గల శివసిద్ధి హనుమాన్ ఆలయంలో ఆలయ అధ్యక్షుడు దత్తు ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేస్తున్నారు. తుమ్మిడిహేటి ప్రాణహిత నది వద్ద గల కార్తీక్ మహారాజ్ ఆలయంలో జాతర ఏర్పాట్లను ఆలయ అధ్యక్షుడు బొల్లంపల్లి ప్రకాష్‌గౌడ్ నిర్వహిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థమై అన్ని ఏర్పాట్లను చేయడం జరుగుతుందని ఆలయాల కమిటీ అధ్యక్షులు తెలిపారు.

పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దాం



ఆసిఫాబాద్..



పెంచికల్‌పేట్..

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని ఎల్లారం గ్రామంలో పోలియో సందర్భంగా ఏర్పాటు చేసిన చుక్కల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని చిన్నారులకు చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి తుకారాంభట్ మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం పెద్ద మొత్తంలో పోలియో డ్రాప్స్ వేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి సోమ, మంగళ వారాల్లో వారివారి ఇండ్లలోకి వెళ్లి ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీలు పోలియో డ్రాప్స్ వేస్తారని తెలిపారు. జైనూరు మండల కేంద్రంలో నిర్వహించిన పోలియో కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారం ఎంపీటీసీ దుర్గం నిర్మల, మాజీ సర్పంచ్ సీతారం, మాజీ ఉప సర్పంచ్ దుర్గం చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ వినోద్, హెల్త్ సూపర్‌వైజర్ ఉత్తమ్, సూపర్‌వైజర్ గోవర్దన్, అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ ఆశ కార్యకర్త భారతి, గ్రామ అధ్యక్షులు నానయ్యలు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంపీపీ విమలాబాయి పాల్గొని 0 నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు ఉన్న ప్రతి బిడ్డకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి ఉప్రె వినయ్, సిబ్బంది లక్ష్మణ్, ఊశన్న, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్టు వైద్యాధికారి ఉప్రె వినయ్ తెలిపారు. 0 నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు అన్ని పోలియో కేంద్రాల వద్ద పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. తిరిగి నేడు కూడా ఇంటింటికి తిరుగుతూ పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పోలియో చుక్కలు వేస్తారని, అందరు సహకరించాలని ఆయన కోరారు.

కౌటాల : ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు రెండు చుక్కలు పల్స్ పోలియో ఆదివారం తలపెట్టిన పల్స్ పోలియో కార్యక్రమం మండలంలో 94 శాతం పూర్తి అయిందని సీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యురాలు నవత తెలిపారు. మండలంలో 2600 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉండగా అందులో ఆదివారం 2452 మందికి పల్స్ పోలియో చుక్కలు వేసినట్టు ఆమె తెలిపారు. మిగిలిన 148 మంది పిల్లలకు నాలుగు, ఐదు తేదీల్లో ఇంటింటికి తిరిగి వేయనున్నట్టు తెలిపారు. పల్స్ పోలియో విజయవంతం కావడానికి అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది కృషి చేసినందుకు వారిని అభినందించారు.

సిర్పూర్(టి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 0 నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజంగా ఉండాలని, ప్రభుత్వం ఉచితంగా ఈ మందును పంపిణీ చేస్తున్నట్టు లోనవెల్లి వైద్యురాలు నవత అన్నారు. మండలంలో 25 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు, ఈ కార్యక్రమం రెండు రోజులుంటుందన్నారు. నేడు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, తల్లిదండ్రులు వైద్యసిబ్బంది సహకరించి తమ పిల్లలకు పోలియో సోకకుండా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

పెంచికల్‌పేట్ : ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని జెడ్పీటీసీ సముద్రాల సరిత అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో వంద శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. పోలియో చుక్కల కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీతారామ్ పరిశీలించారు. మండలంలో 2054 మంది పిల్లలకు గాను 1856 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి హర్షిన్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ హరిదాస్, హెచ్‌ఈఓ కోటేశ్వర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ మణి విక్టోరియా, ఏఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కౌటాల..



సిర్పూర్(టి)..



కౌటాల..

కనువిందు చేస్తున్న మోదుగ పూలు

- ప్రకృతిని ఆస్వాదిస్తున్న ప్రజలు



నవతెలంగాణ-వాంకిడి

వేసవిలో మోదుగ పూలు చూపరులను ఆకట్టుకుంటాయి. అగ్నిజ్వాలల వలె ఎర్రెర్రని ఈ పూలు సూర్యకాంతికి ధగధగ మెరిసిపోతూ ఉంటాయి. మండలంలోని కన్నర్‌గావ్ గ్రామ సమీపంలో గల రహదారికి ఇరువైపుల గల మోదుగ చెట్లు రంగురంగుల పూలతో రహదారి వైపు నుండి వెళ్లే ప్రయాణికులను కనువిందు చేస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంతో ముగ్ధులను చేస్తున్నాయి. సాధారణంగా వేసవికాలంలో చెట్ల ఆకులు రాలిపోయి మోడువారినట్టు కనిపిస్తుంటాయి. అయితే మోదుగ చెట్లు మాత్రం అందుకు ప్రత్యేకం. రంగురంగుల పూలతో గుంపులుగుంపులుగా పూసి పూలతో రహదారి వెంట వెళ్లే ప్రతి ఒక్కరిని ఆకర్షిస్తున్నాయి.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని దరోగపెల్లి, చెడ్వాయి, కొండపెల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు జాతీయ ఉపాధిహామీ చట్టంలో భాగంగా మంజూరైన సీసీ రోడ్ల పనులను ఆదివారం ప్రారంభించారు. చెడ్వాయి, కొండపెల్లి గ్రామాల్లో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా మంజూరైన రూ.20 లక్షలతో సబ్‌సెంటర్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉపాధిహామీ చట్టంలో భాగంగా రూ.10 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులను అందజేస్తుందన్నారు. సబ్‌సెంటర్ల నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, డీఈ ఆంజనేయులు, ఏఈ ప్రవీన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మధూకర్, బీజేపీ నాయకులు సాయిరె శ్రీనివాస్, మనోజ్, పాలె మహేష్, ప్రభాకర్, పురుషోత్తం, శేఖర్, ఇస్తారి, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ముగిసిన క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూడు రోజుల నుండి జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ ఆర్మ్డ్ పోలీస్ టీం, స్పెషల్ పార్టీ పోలీస్ టీంల మధ్య జరిగింది. ఇందులో స్పెషల్ పార్టీ పోలీస్ టీం విజేతలుగా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలను జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ కరచాలనం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు త్వరలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. క్రీడల వల్ల ఐక్యమత్య భావన పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతర ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తాటిపెల్లి కుర్త వద్ద నిర్వహించే మహాశివరాత్రి శివసిద్ధి హనుమాన్ మందిర్‌లో జాతర ఉత్సవాలకు మహారాష్ట్ర రాజూరా ఎమ్మెల్యే సుభాష్ బావు డోటెను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆదివారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి జాతర ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా రావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తు కోరారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు మారుతి, తిరుపతి, ప్రవీణ్, నితీష్, మణిరాం, సునీల్ ఉన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాల గడువు పొడగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6 నుండి 10 వ తరగతి లో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి తుది గడువు ఈ నెల 11 వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గడువు 2వ తేదీన ముగియగా విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు మోడల్ స్కూల్స్ అదనపు సంచాలకులు తుది గడువును 11వ తేదీ వరకు పొడిగించినట్లు, సమీప మీ-సేవా కేంద్రాల్లో లేదా ఆన్‌లైన్ కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న నిర్వహించబడుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫ్లై ఓవర్ బాధలు తీరేనా..?



అసంపూర్తిగా ఉన్న రైల్వే ఫ్లైఓవర్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాగజ్‌నగర్, సిర్పూర్ మార్గమధ్యలో ఉన్న వేంపల్లి గేటు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వంతెన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ వంతెన నిర్మాణ పనులు సుమారు ఏడు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణీకులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం నుండి బెజ్జూరు, చింతలమానెపెల్లి, కౌటాల, సిర్పూర్ నుండి నిత్యం కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌కు రాకపోకలతో మార్గం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతాల నుండి చదువు, వ్యాపార, వైద్య నిమిత్తం ఈ మార్గం గుండానే రాకపోకలు కొనసాగుతుంటాయి. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో రైల్వే గేటు పడడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. అత్యవసర వైద్యం కోసం వెళ్లే సమయంలో ప్రాణాలు పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

అధికారులారా స్పందించండి...

ఫ్లైఓవర్ పనులు రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ పనులు 70 శాతం మేరకు పూర్తిచేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగా పనులు వదిలేశారు. రైల్వే ట్రాక్‌పై నిర్మించాల్సిన స్లాబ్ రైల్వే అధికారులు వేయాల్సి ఉంటుంది. అధికారులు ఫ్లై ఓవర్ విషయంలో పట్టించుకొని స్లాబ్ వేస్తే రైల్వే గేటు వద్ద నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి ఉండదు. ఫ్లై ఓవర్ లేకపోవడంతో రైల్వే అధికారులు రైల్వే గేటు వద్ద మరమ్మత్తు పనులు చేపట్టిన సమయంలో రైల్వే గేటును రెండు, మూడు రోజులు మూసివేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలిగిన సంఘటనలున్నాయి. ఈ సమస్యపై కేంద్ర, రాష్ట్ర సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిపోయిన ఫ్లై ఓవర్ పనులను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళ హత్యకేసులో నింధితుడి అరెస్టు

- పెళ్లికి అడ్డువస్తుందని హత్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈస్‌గాం పోలీస్ స్టేషన్ పరిధి గన్నారం గ్రామం మండువకు చెందిన కమ్మరి రోజ(25) ఈ నెల 28న రాత్రి హత్యకు గురికాగా నింధితుడిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. రోజకు గతంలోనే వివాహంకాగా భర్తతో విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో నజ్రూల్ నగర్ విలేజ్ నెంబర్ 13కు చెందిన సాగర్ మండల్‌తో సంవత్సర కాలంగా రోజకు పరిచయం ఏర్పడింది. ఇద్దరు పెళ్లి చేసుకుందామనుకున్నారు. ఇటీవల సాగర్ మండల్ వివాహానికై వేరే సంబంధాలు చూస్తుండడంతో విషయం రోజకు తెలిసి ఈ నెల 28న రాత్రి సాగర్‌ను తన ఇంటికి పిలిచింది. తనను కాదని వేరే వివాహం ఎలా చేసుకుంటావని సాగర్‌ను నిలదీయడంతో రోజను అడ్డు తొలగించుకోవాలని భావించిన సాగర్ రోజ ముక్కు, నోరు మూసి గొంతు నలిమి హత్య చేశాడు. 29న ఉదయం మృతురాలి తల్లి కమల ఫిర్యాదు మేరకు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆదివారం కాగజ్‌నగర్ ఇన్‌చార్జి డీఎస్పీ సదయ్య, రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై రామన్ కుమార్ నింధితుడిపై హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద బైక్, మొబైల్ ఫోన్ సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో 5 శాతం దివ్యాంగులకు కేటాయించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ పథకాల్లో 5 శాతం దివ్యాంగులకు కేటాయించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బాలభారతి పాఠశాల ఆవరణలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో అక్రమాలు ఉన్నాయని, ఆర్థిక నిర్వహణ సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. నిధుల పర్యవేక్షణ చేయడంలో వికలాంగుల సంక్షేమ శాఖ విఫలం చెందుతుందన్నారు. ఆర్థిక సంవత్సరం చివరిలో నిధులు విడుదల చేయడం వల్ల లబ్ధిదారులకు అందకుండా పోతున్నాయని, పెన్షన్ నిధులను ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి అనేక పథకాల ప్రచారానికి వినియోగిస్తున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల ద్వారా వికలాంగుల వివరాలను గ్రామ స్థాయిలో సమగ్ర సమాచారం సేకరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 12.2శాతం వికలాంగులున్నారని, రాజకీయ పార్టీలు వికలాంగుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులాలకు ఇస్తున్న ప్రాధాన్యత సమాజంలో అత్యంత వెనుకబడిన వికలాంగులకు ఇవ్వడం లేదన్నారు. రాజకీయ పార్టీలు సకాలంగుల సంక్షేమం కోసం అనేక కొత్త పథకాలు ప్రకటిస్తున్నారని కానీ వికలాంగుల కోసం ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్, జిల్లా నాయకులు ప్రదీప్ మండల్, పి.రాజేష్, రాజయ్య, అశోక్ కుమార్, జాకీర్, అశోక్, లక్ష్మి, సంతోష్, ప్రమీల, ఉప్పరి వెంకటేష్, సప్తగిరి రెడ్డి, రమేష్, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య

ప్రశాంతంగా ఎంజేపీ ప్రవేశ పరీక్ష

- సెంటర్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలురు, బాలికలకు 6, 7, 8 బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం ఆదివారం జిల్లాలో జరిగిన పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఎంజేపీ జిల్లా కన్వీనర్ వెంకటప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివిధ పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూడాలన్నారు. ప్రవేశ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎంజేపీ కన్వీనర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 8 పాఠశాలల్లో బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీ కోసం జరిగిన ఈ పరీక్షకు 2138 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జిల్లాలో జరిగిన పరీక్ష కోసం 6వ తరగతికి 1086 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1001 మంది, 7వ తరగతికి 594 మంది దరఖాస్తు చేసుకోగా 549 మంది, 8వ తరగతి ఖాళీల కోసం 458 మంది దరఖాస్తు చేసుకోగా 425 మంది హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో 92.37 శాతం హాజరు నమోదైందని, పరిమిత స్థాయిలో సీట్ల కోసం కూడా జిల్లాలో అనూహ్య స్పందన వచ్చిందన్నారు. పరీక్షలో ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. త్వరలో పరీక్ష ఫలితాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతపర్చాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృత పరచాలని లయన్స్ క్లబ్ 320జీ జిల్లా గవర్నర్ హనుమాన్ల రాజిరెడ్డి అన్నారు. ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని మాణిక్ గూడ గ్రామంలోని కొలాం తెగకు గల విద్యార్థులకు ఆసిఫాబాద్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహియా (తారిక్) అధ్యక్షతన చేపట్టిన పుస్తకాలు, పెన్నుల పంపిణీ, గ్రామస్తులకు బట్టల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ లైన్స్ క్లబ్ సేవలు చాలా బాగున్నాయన్నారు. ఈ సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేద ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ గవర్నర్ రెక్కల నారాయణరెడ్డి, జిల్లా బాధ్యులు నారాయణరావు, నాంపల్లి శంకర్, రమణారెడ్డి, రావుల వినాయకరావు, పుల్లూరి శంకర్, రాజీవ్ రెడ్డి, నాంపల్లి పద్మ, మమతారెడ్డి పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | మార్చి 4, 2024 | www.navatelangana.com

కరాటే కుంగ్ ఫూ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి



సెవెంత్ సౌతిండియా లెవల్ కరాటే కుంగ్ ఫూ పోటీలను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదివారం ప్రారంభించారు. సింగరేణి సీఐఎస్ఎఫ్ బ్యారక్‌లో స్వర్గీయ మాజీ కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి స్మారకార్థం జరుగుతున్న సెవెంత్ సౌతిండియా లెవల్ కరాటే కుంగ్ ఫూ పోటీలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కరాటే పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బండి సదానందం, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మందమర్రి



గృహజ్యోతి పథకాన్ని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదివారం మందమర్రి ఏరియాలో ప్రారంభించారు. 6 గ్యారెంటీల అమలులో భాగంగా ఈ పథకాన్ని ప్రారభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పేద వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. పేదలకు 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించిన వారికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోందని పేర్కొన్నారు. పేదలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాలను పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల మాత శిశు ఆస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జీసీ సుబ్బారాయుడు, ఆర్ఎంఓ భీష్మతో కలిసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాలను పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారుల సమన్వయంతో పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నామని అన్నారు. జిల్లాలో 0-5 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే జిల్లావ్యాప్తంగా 459 పోలియో కేంద్రాల ఏర్పాటుతో పాటు 918 బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 25 ట్రాన్సిస్ట్ బృందాలతో పాటు 25 మొబైల్ బృందాలను నియమించడం జరిగిందని, 95 శాతం పోలియో చుక్కల పంపిణీని కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఆదివారం జన్మించిన 6 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారని, జిల్లావ్యాప్తంగా 75 వేల 735 మంది 0-5 వయసు గల పిల్లలను గుర్తించడం జరిగిందని తెలిపారు. పోలియో చుక్కలు అందని వారికి ఈ నెల 4, 5 తేదీలలో ఇంటింటికి తిరుగుతూ పోలియో చుక్కలు అందని పిల్లలను గుర్తించి 100 శాతం కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా.అనిత, డా.నీరజ, మాస్ మీడియా అధికారి బొక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నస్పూర్‌లో..

పీహెచ్‌సీలో పోలియో చుక్కలను వేసిన చైర్మన్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో పీహెచ్‌సీలో పోలియో చుక్కల పంపిణీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ వేణు ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలియో నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తల్లితండ్రులు విధిగా పిల్లలకు పుట్టిన వారి నుంచి 5 సంవత్సరాలలోపు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ సతీష్, మెడికల్ ఆఫీసర్ సమత, స్థానిక వార్డ్ కౌన్సిలర్ సుమతి-మల్లేష్ పాల్గొన్నారు.

జైపూర్ : ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలకు పోలియో చుక్కలు విధిగా వేయించాలని ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో స్థానిక ఎంపీటీసీ లింగస్వామితో కలిసి చిన్నారులకు పోలీయో చుక్కలు వేసిన ఆమె పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని పేర్కొన్నారు. షెట్‌పల్లి గ్రామంలో స్థానిక జడ్పీటీసీ మేడి సునిత పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. జైపూర్ ఆరోగ్య కేంద్రంతో పాటు భీమారం ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్దేషిత లక్ష్యంగా 2288 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సివుండగా 2016 మంది పిల్లలకు 94 శాతం పోలియో చుక్కలు వేసినట్లు స్థానిక మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్ తెలిపారు. అదేవిధంగా కుందారం ఆరోగ్య కేంద్రం పరిధిలో 1435 మంది పిల్లలకు గాను 1384 పిల్లలకు 96 శాతం పోలియో చుక్కలు వేసినట్లు స్థానిక వైద్యాధికారి శ్రావ్య తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికి తిరగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

లక్సెట్టిపేట : మండల వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఉత్కూర్ గ్రామపంచాయతీలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నిండు జీవితానికి రెండు చుక్కలు వేసుకొని పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకొని వచ్చి పోలియో చుక్కలు వేయించారు.

మందమర్రి : నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో మందు అవసరమని ఏఎన్ఎం శంకరమ్మ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మందమర్రి నేతాజీనగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటల నుండే ఐదేండ్లలోపు పిల్లలకి పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆశాలు ఎం లక్ష్మి, పి శారదా, అంగన్‌వాడీ ఏ లలిత, ఆర్‌పీ ఆర్ సరోజ, ఎం లావణ్య పాల్గొన్నారు.


జన్నారంలో..


జైపూర్‌లో..


లక్సెట్టిపేటలో..


మందమర్రిలో..

ఉద్యోగులకు పదవి విరమణ సహజమే

● ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు బదిలీలతో పాటు, పదవి విరమణ సహజమేనని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. ఆదివారం జన్నారం పట్టణానికి చెందిన, గోపి సత్యనారాయణ ఆర్టీసీలో, డిప్యూటీ సూపరింటెండెంట్,(ట్రాఫిక్)గా విధులు నిర్వహించి, పదవి విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గోపి సత్యనారాయణ ఆర్టీసీ కండక్టర్గా విధులు నిర్వహించి, పేద ప్రజలకు ఎంతో సేవలు అందించారన్నారు. దినదిన అభివృద్ధి చెందుతూ డిప్యూటీ సూపరిండెంట్‌గా పదోన్నతి పొందారన్నారు. అతను ఆర్టీసీకి చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అతని శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో సుఖసంతోషాలతో గడపాలని కోరుకుంటున్నామన్నారు. అనంతరం సత్యనారాయణ దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు కొంతం శంకరయ్య, అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్, లెక్కల మల్లయ్య, న్యాయవాది మల్లయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

● పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి

నవతెలంగాణ-హాజీపూర్



అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం కాదు పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలని, అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యాన మాట్లాడారు. రోగానికి మందు వెయ్యరు కాని ప్రాణాలు తియ్యడానికి ఉరితాడు పే నుతున్నారన్నారు. ఏడాది కాలం నుంచి రూం రెంట్ డబ్బులు చెల్లించడం లేదన్నారు. ఏండ్ల తరబడి టీఏ, డీఏలు చెల్లించడానికి డబ్బులు లేవా అని ప్రశ్నించారు. కేంద్రాల్లో పిల్లలకు అట వస్తులు ఏవన్నారు. సొంత భవనాలు ఇప్పటికీ లేవన్నారు. నాణ్యమైన పౌస్టికహారం పెట్టే పని చేసేటోల్లకు నెలనెలా జీతలివ్వరన్నారు. అధికారులు చేస్తున్న అవినీతిని అడ్డుకోరనీ అన్నారు. ఐసీడీఎస్‌ను బలోపేతం కోసం సరిపడా డబ్బులు కేటాయించాలన్నారు. టీచర్లను, అయాలను కేంద్రాల్లో పని యేయనియకుండా సంబంధం లేని పనులు చేయిస్తారన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎంజేపీ బ్యాక్‌లాగ్ సెట్

● ఎంజేపీ జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్

నవతెలంగాణ-హాజీపూర్

మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాలలో 6,7, 8వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకై నిర్వహించిన మహాత్మా జ్యోతిబా పూలే బ్యాకలాగ్ సెట్ ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 1975 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1768 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు తెలియచేసారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాలను జిల్లా అబ్జర్వర్ తిరుపతిరెడ్డితో కలిసి పరిశీలించారు. జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు.

గంగపుత్రులను ప్రభుత్వం ఆదుకోవాలి

● రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సముద్రాల రూప



నవతెలంగాణ-జన్నారం

గంగపుత్రులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ గంగపుత్ర ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సముద్రాల రూప అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మారం గ్రామంలో, గంగపుత్రలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగపుత్రులకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించాలన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర ఐక్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ధర్మారం గ్రామానికి చెందిన పందిరి లతను నియమించినట్లు తెలిపారు. గంగపుత్రులంతా ఐక్యంగా పోరాటం చేస్తేనే తమ హక్కులను సాధించుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో ధర్మారం గ్రామ గంగపుత్ర ఐక్య సంఘ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రతి ఒక్కరి బాధ్యత

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో ఆదివారం కేంద్ర భద్రత బలగాలు ప్రధాన వీధుల గుండా లాకౌట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలంతా శాంతియుతంగా, సామరస్యంగా ఉండేందుకే ఈ లాకౌట్ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక బలగాలతో పాటు ఎస్ఐ సాగర్, పోలీస్ సిబ్బంది జితేందర్, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

రాజన్నల సంఘం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు



నవతెలంగాణ-మందమర్రి

రాజన్నల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని రాజన్న వాడ మేకల మండి ప్రాంతంలో ఆదివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రూ.50 వేల వేయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మందమర్రి సీఐ శశిధర్, ఎస్ఐ రాజశేఖర్ ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి సంఘం వారు, ప్రతీ పౌరుడు ఇలాంటి ఆలోచనతో ముందుకు వచ్చి వీధుల్లో కెమెరాలను అమర్చుకుంటే నేరాలను పూర్తిగా అరికట్టవచ్చన్నారు. ఒక్క సీసీ కెమెరా 10 మంది పోలీసులతో సమానమని అన్నారు. కెమెరాలు ఏర్పాటు చేసుకున్నందుకు సంఘం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గోపికృష్ణ, రాము, సంఘం అధ్యక్షుడు జక్కుల శంకర్, గౌరవ అధ్యక్షులు మొగిలి కనకయ్య, ప్రధాన కార్యదర్శి జక్కుల సమ్మయ్య, కార్యదర్శి కుమార్, కోశాధికారి సంపత్ పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్‌లో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసి దేవాపూర్‌లోని షైక్ నైమ అనే వ్యక్తి ఇంటిని అద్దేకి తీసుకోని పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచారనే సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్ఐ లచ్చన్న, సిబ్బంది శ్రీధర్, శ్రీను, రాజు, రాకేష్‌తో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు పీడీఎస్ రైస్ ముత్యంపల్లికి చెందిన ఎండీ తాజ్‌కు చెందినవిగా గుర్తించి సుమారు 40 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత డాక్టర్ ప్రవీణ్ కుమార్‌కు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోనూర్‌కు చెందిన కీళ్ల ఎముకుల వైద్య నిపుణులు డాక్టర్ బుద్దె ప్రవీణ్ కుమార్‌ను మంచిర్యాలలోని ప్రవీణ్ ఆస్పత్రిలో పలువురు నాయకులు సన్మానం చేశారు. రాష్ట్ర ఉత్తమ డాక్టర్‌గా మంచిర్యాల జిల్లా నుంచి ఎంపికై బెంగళూరులో జరిగిన హెల్త్‌కేర్ ఇన్నోవేషన్ సమ్మిట్ కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్‌ను కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అక్కల రవి, నల్ల శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, అక్కల శేఖర్, పెట్టం బాణేశ్ పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆసిఫాబాద్ మండలంలోని జెండాగూడ గ్రామానికి చెందిన జాడి ఆకాష్ అనే వ్యక్తి బొలేరో వాహనంలో ఆసిఫాబాద్ నుండి మహారాష్ట్రకు 11.40 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న క్రమంలో బంబారా గ్రామ సమీపంలో పోలీసులు దాడిచేసి పట్టుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని సీజ్ చేసి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

ఎస్సీ డీడీ అవినీతిపై విచారణ చేపట్టాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాగం శ్రీకాంత్



నవతెలంగాణ-హాజీపూర్

అక్రమంగా గ్రేడ్-1 ప్రమోషన్లు, పోస్టింగ్ ఇచ్చిన మంచిర్యాల షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాగం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేస్త్రిల అకౌంట్లకు డబ్బులు కొట్టించుకుని అపార్ట్మెంట్ నిర్మిస్తున్నారని విమర్శించారు. అధికారి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని వసతి గృహ సంక్షేమ అధికారి గ్రేడ్-1 ప్రమోషన్లు పోస్టింగ్ ఇవ్వడంపై మండిపడ్డారు. సాంఘిక సంక్షేమ కార్యాలయంలో ఏ పని చేయాలన్న ఏ ఫైల్ మీద సంతకం పెట్టాలన్న ముడుపులు ఇస్తే తప్ప ఫైల్ కదలడం లేదన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఇంత అవినీతికి పాల్పడుతున్న సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంపై తక్షణమే కలెక్టర్ ఎంక్వైరీ చేయాలని కోరారు. కొత్త జోనల్ వ్యవస్థ 317 జీఓ వచ్చిన నుంచి నియామకాలకు జీఓ 44 ప్రకారం కొత్త రోస్టర్ పాయింటింగ్ నెంబర్-1 నుంచి మొదలు కావాలి కానీ ఇక్కడ అధికారికి ఇష్టం వచ్చినట్లు ప్రభుత్వ ఆర్డర్లను తుంగలో తొక్కి రోస్టర్ రిజిస్టర్ రాసుకుని కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి వసతి గృహ సంక్షేమాధికారికి గ్రేడ్-1 ప్రమోషన్ ఇవ్వడంపై అనుమానం వ్యక్తం చేశారు. కాళేశ్వరం జోన్‌లోని వ్యక్తి రాజన్న జోన్‌లో ఆర్.తిరుపతికి హెచ్‌డబ్ల్యూఓకు గ్రేడ్-1 ప్రమోషన్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఇలా తప్పుడు ప్రమోషన్ పొందడంతో వీటిపై కోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. ఆ కేసులు పెండింగ్ ఉన్న రివ్యూలు రెండు కూడా పెండింగ్‌లో ఉన్నప్పటికీ పోస్టింగ్ ఇచ్చారన్నారు. ప్రమోషన్లు ఇచ్చేటప్పుడు సీనియారిటీ లిస్ట్ కానీ, అబ్జెక్షన్స్ గాని, అడగాలి కానీ అధికారి అలాంటివి ఏమి చేయకుండా పోస్టింగ్ ఇచ్చారన్నారు. జోనల్ ఆఫీసర్ అనే అహంకారంతో క్లాస్-4 ఉద్యోగాలకు సీనియార్టీ లిస్టు 5 జిల్లాలకు కమ్యూనిటీ చెయ్యకుండా ఇద్దరికీ గ్రేడ్-1, ఒక్కరికి జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు ఇచ్చారన్నారు. అక్రమంగా ప్రమోషన్ తీసుకున్న ఆర్. సురేష్, ఆర్.తిరుపతిలపై పూర్తి విచారణ జరిపాలన్నారు. వీరికి అక్రమంగా ప్రమోషన్లు పోస్టింగ్లు ఇచ్చిన మంచిర్యాల షెడ్యూల్ కులాల అభివద్ధి శాఖ అధికారి ఇచ్చినట్లు మంచిర్యాల కలెక్టర్ దృష్టిలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు అధికారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా వీటిపై స్పందించి కలెక్టర్ తక్షణమే విజిలెన్స్ ఎంక్వయిరీ నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మనోహర్, రాహుల్, కార్తీక్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌సీఓఏ క్లబ్‌లో ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్‌సీఓఏ క్లబ్‌లో 1976 నుంచి 31 మార్చి 2024 వరకు రిటైర్డ్ అయిన అధికారులు, మైనింగ్ స్టాఫ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్య తిథిగా ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన అధికారులు, మైనింగ్ స్టాఫ్ అధికారులు వివిధ ప్రాంతాల నుంచి ఒక దగ్గర చేరి ఇలా ఆత్మీయ సమ్మేళనం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాలను చెప్పుకుంటూ సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఎంతో ఉత్సాహంగా గడిపడం, ఎక్కడెక్కడో ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగులు ఒక చోటుకు చేరి నాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకోవడం గొప్ప అనుభూతిని కలిగించిదని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రిటైర్డ్ డైరెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ఆర్కే-7 గనిలో పనిచేసిన సర్వీస్ కాలంలో ఎన్నో అనుభూతులు, ఎన్నో వ్యత్యాసాలు మధ్య, ఆనాడు పనిచేశామని, ఇప్పుడు అవి గుర్తుకొస్తే చాలా సంతోషంగా ఉందని సింగరేణి లోనే అతిపెద్ద భూగర్భ గని ఆర్కే-7 అని, ఈ గనిలో పనిచేసిన అధికారులందరూ ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం రీజియన్ జీఎం సేఫ్టీ రఘు కుమార్, రిటైర్డ్ సీజీఎం బానోత్ చంద్రు, రిటైర్డ్ జీఎం రామ్‌రెడ్డి, రిటైర్డ్ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, రిటైర్డ్ జీఎం వీరస్వామి, రిటైర్డ్ డీజీఎం ఆర్‌సీటీ రాజ్, ఆర్కే సెవెన్ గ్రూప్ ఏజెంట్ రాముడు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా.. తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతాగూడ గ్రామంలో ప్రధాన రహదారిపై అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొర్రిగూడ గ్రామానికి చెందిన, సుధాకర్ నాయక్, చింతగూడ గ్రామానికి వచ్చి, తిరిగి తన స్వగ్రామం మొర్రిగూడకు వెళుతున్న సందర్భంలో ఆదివారం సాయంత్రం, కారు అదుపుతప్పి ప్రధాన రహదారిపై బోల్తా పడింది. కారు పల్టీలు కొట్టినా కారులో ప్రయాణిస్తున్న సుధాకర్ నాయక్‌కు ఏమీ కాలేదు. కారులో సుధాకర్ తప్ప ఎవురు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.